విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

జగనన్న విదేశీ విద్యాదీవెన పేద విద్యార్థులకు వరం

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: జగనన్న విదేశీ విద్యాదీవెన నిరుపేద విద్యార్థినీ విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి అన్నారు.బుధవారం జగనన్న విదేశీ విద్యా దీవెన అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ.41.60 కోట్లను రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి కంప్యూటరు ద్వారా బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యేలా ప్రారంభించారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 95 మందికి, వారిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11 మంది అభ్యర్థులకు ప్రోత్సాహకరంగా రూ.100.50 లక్షల మొత్తం రూ 42.6 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమచేసింది. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జగనన్న విదేశీ విద్యా దీవెన ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, సంబంధిత అధికారులు, విద్యార్థుల వారి తల్లి దండ్రులు, తదితరులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రపంచంలోనే టాప్ యూనివర్సిటీల్లో మన విద్యార్థులు ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలబడటం, సివిల్స్ చదివే వారికి సాయం అందించి మంచి ప్రోత్సాహం అందించుట అపూర్వ అద్భుత సంఘటన అని అన్నారు. జిల్లాలో 8 మంది విద్యార్థిని, విద్యార్థుల వారి తల్లి తండ్రులకు 60.76 లక్షల రూపాయల నమూనా చెక్కును జిల్లా కలెక్టరు అందజేశారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 5 మంది అభ్యర్థులకు ప్రోత్సాహకరంగా రూ.1 లక్ష చొప్పున రూ.5 లక్షలు జమ చేయనున్నట్లు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి. శ్రీమన్నారాయణ రెడ్డి, జిల్లా వార్డు, సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి జివికె మల్లిఖార్జునరావు, విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జగనన్న విదేశీ విద్యాదీవెన కింద 11 మంది విద్యార్థులకు రూ.84.93 లక్షలు

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద 13 మంది విద్యార్థులకు రూ. 86.93 లక్షలు ఆర్థిక ప్రయోజనం చేకూరిం దని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ జమచేశారు.ఏలూరు కలెక్టరేట్ విసి హాలు నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, సాంఘిక సంక్షేమ శాఖ జెడి జయప్రకాష్, ఏలూరు ఆర్డిఓ ఎస్.ఎస్.కె. ఖాజావలి, నగరపాలకసంస్థ కమిషనర్ ఎస్. వెంకటకృష్ణ, డిఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ట, జెడ్పి డిప్యూటీ సిఇఓ ఎస్. నిర్మలా జ్యోతి, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద 13 మంది విద్యార్థులకు రూ. 86.93 లక్షల మెగా చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న విదేశీ విద్యాదీవెన కింద 11 మంది విద్యార్థులకు రూ. 84 లక్షల93వేల 077 ఆర్థిక సహాయాన్ని అందించగా జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సా హం కింద రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించినట్టు తెలిపారు.

26 నుంచి ఆడుదాం..ఆంధ్ర టోర్నమెంట్

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో ఈనెల 26 నుంచి నిర్వహించే ఆడుదాం..ఆంధ్ర టోర్నమెంట్ నిర్వహణకు పూర్తిస్థాయిలో సన్నద్ధమైనట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి బుధ వారం ఆడుదాం..ఆంధ్ర కార్యక్ర మంపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ కు ఏలూరు కలెక్టరేట్ విసి హాలు నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, ఏలూరు ఆర్డిఓ ఎస్.ఎస్.కె. ఖాజావలి, డిఎస్ డిఓ బి. శ్రీనివాసరావు, డిఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ట, డిఇఓ శ్యామ్ సుందర్, నగరపాలక సంస్థ కమిషనరు ఎస్. వెంకటకృష్ణ, జెడ్పి డిప్యూటీ సిఇఓ ఎస్. నిర్మలాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేం దుకు, ప్రోత్సహించడంతోపాటు ప్రతిఒక్కరి ఆరోగ్యంపట్ల అవగాహన కలిగించేందుకు ఈ టోర్నమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. ఈ పోటీల నిమిత్తం ఇంతవరకు 1,42,347 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. జిల్లాలో ఈనెల 26 నుంచి నిర్వహించే ఆడుదా..ఆంధ్ర టోర్నమెంట్‌ను ప్రణాళిక బద్ధంగా నిర్వహించి విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం

విశాలాంధ్ర - కామవరపుకోట : సమ్మె పోరాటంలో ఉన్న అంగన్వాడి సమస్యలు పరి ష్కారం అయ్యేవరకు అంగన్వాడిల ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏఐటీ యూసీ చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షులు టీవీఎస్ రాజు అంగన్వాడి వర్కర్లకు హామీ ఇచ్చారు. అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా కామవరపుకోటలో 9 రోజుల నుండి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగిస్తున్నారు. బుధవారం అంగన్వాడీల ఆందోళనలో పాల్గొన్న టీవీఎస్ రాజు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని చేస్తున్న డిమాండ్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిఐటీయు నాయకురాలు షేక్ సుభాషిని, సీనియర్ అంగన్వాడి వర్కర్ బి. శాంత కుమారి, సిరికినేటి జగదీశ్వరి, బి. సౌభాగ్య లక్ష్మి, తాడిగడప భువనేశ్వరి, మరియరాణి తదితరులు పాల్గొన్నారు.

Sir CR REDDY COLLEGE OF PHARMACEUTICAL SCIENCES
SANTHI NAGAR, ELURU-534007, ELURU DISTRICT. PH: 08812-231492
NOTIFICATION :: CAT-B / SPOT ADMISSION (APEAPCET-2023)
Sir C.R. Reddy College of Pharmaceutical Sciences, Eluru invites applications for SPOT ADMISSIONS to eligible students into B.Pharmacy and Pharm-D courses for the academic year 2023-24 on 27-12-2023 as per APSCHE Rules.
Note: Spot admission Candidates are not eligible for Tuition fee reimbursement vide G.O.Ms. No. 66, SW-Edn., Department dated08-09-2010 and Jagananna Vidya & Vasati Deevena Schemes.
Cell:9985854428, 7382164545 KILARU PRABHAKAR RAO, I/C SECRETARY

సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-తణుకు/బుట్టాయిగూడెం: ఈనెల 26 వ తేదీన సీపీఐ 98 వ వ్యవ స్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. బుధవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో జరిగిన సీపీఐ తణుకు పట్టణ సమితి సమావేశంలో భీమారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ వున్న అన్ని గ్రామ శాఖల్లో సీపీఐ పతాకాలను ఆవిష్క రించి సీపీఐ సాగించిన ప్రజాపోరాటాలు, సాధించిన విజయాలు వివరిస్తూ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని కోరారు. దున్నేవానికే భూమి దక్కాలని సీపీఐ చేసిన పోరాట ఫలితంగానే భూసంస్కరణల చట్టం రూపు దాల్చిందని, లక్షలాది మంది పేదలకు భూపంపిణీ జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు సాగిస్తుందన్నారు.సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ తణుకు పట్టణంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిశీలనకు జనవరి మొదటి వారంలో వార్డుల్లో సీపీఐ బృందం పర్యటించి ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారం సాధన దిశగా తణుకు నియోజకవర్గ అభివృద్ధి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. పుట్టా అమ్మిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ పట్టణ సమితి సభ్యులు గుబ్బల వెంకటేశ్వరరావు, బొద్దాని మురళీకృష్ణ, కోరాడ సుధీర్ బాబు, బి.కృష్ణకిషోర్, నమ్మి రాజు, కె.రవికుమార్, కోరాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐ పాత్రవెలకట్టలేనిది

ఈనెల 26వ తేదీన సిపిఐ వ్యవస్థాపక వేడుకలు ఘనంగా నిర్వహించాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. బుధవారం బుట్టాయిగూడెం మండలంలోని విప్పలపాడులో మడకం దుర్గారావు, కొమరం గౌతమి అధ్యక్షతన సిపిఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో సిపిఐ ఆవిర్భవించి, 98 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఈనెల 26న 99వ సంవత్సరంలోనికి అడుగుపెడు తుందన్నారు. దేశ స్వాతంత్రం కోసం జరిగిన ఉద్యమాలలో సిపిఐ పాత్ర వెలకట్ట లేనిదన్నారు. అణగారిన వర్గాల కోసం, దున్నేవానికి భూమి దక్కాలని సిపిఐ అనేక పోరాటాలు నిర్వహించిం దన్నారు. సిపిఐ పోరాటాల ఫలితంగానే భూసంస్క రణ చట్టం వచ్చిందన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశం అనంతరం ఏఐటీయూసీ, మహిళా సమాఖ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు అంగన్వాడీ కార్యకర్తల దీక్ష ప్రాంగణానికి వెళ్లి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, జిల్లా సమితి సభ్యులు సీత మహాలక్ష్మి, ఊయుకే చంద్రం, ఊయుకే నాగేశ్వర రావు, ఉడతా గంగాదేవి, కారం వీరమ్మ, వెంకాయమ్మ, తెల్లం వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా వైయస్సార్ ఆరోగ్యశ్రీ

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : పేదల ఆరోగ్యానికి భరోసాగా ఆరోగ్యశ్రీ నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.బుధవారం భీమవరం పట్టణంలోని బలుసుమూడి రామాలయం వీధిలోని ఆరోగ్యశ్రీ కార్డుదారులతో జిల్లా కలెక్టర్ మమేకమై ఆరోగ్యశ్రీ కార్డు ప్రయోజనాలను వారికి క్షుణ్ణంగా వివరించారు. ఇంతకుముందు ఉన్న రూ.5 లక్షల ప్రయోజనాన్ని రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంపుదల చేయడం జరిగిందని ఈ విషయాన్ని కార్డుదారులు గ్రహించాలన్నారు.ఆరోగ్యశ్రీ కార్డు పొందిన ప్రతి ఒక్కరు ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని, దీని ద్వారా ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పిటల్స్ ఏఏ ప్రాంతాల్లో ఉన్నాయో తదితర సమాచారాన్ని తెలుసుకోవడం సులువు అవుతుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని ఏఎన్ఎంలు, హెల్త్ సెక్రటరీ, మహిళా పోలీస్ ఆరోగ్యశ్రీ, దిశా యాప్‌లను తప్పనిసరిగా డౌన్లోడ్ చేయించి వాటి ప్రయోజ నాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు, పురపాలక సంఘం కమిషనరు ఎం. శ్యామల, వైద్యాధికారిణి డా.యస్ కృష్ణదుర్గ, ఏయన్ యంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య మిత్రాలు, వార్డు వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

22న ముదినేపల్లి మండలంలో జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర-ముదినేపల్లి: ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో జేకేసి గ్రీవెన్స్‌డే నిర్వహణలో భాగంగా ముదినేపల్లి మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 22 వ తేదీ శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ముదినేపల్లిలో "వి కన్వెన్షన్" కల్యాణ మండపం, గుడ్లవల్లేరు రోడ్డు, ముదినేపల్లిలో మండల స్థాయి "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం ఈనెల 22వ తేదీ శుక్రవారం ఉదయం గం.10 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి మండల ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో అందరు జిల్లా అధికారులతో కలిసి నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్త్రీ నిధి డైరెక్టర్‌గా కృపామణి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆంధ్రప్రదేశ్ స్త్రీ నిధి రాష్ట్ర డైరెక్టర్ గా తోట కృపామణి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు సమాచారం ఇస్తూ ఈ నెల 28వ తేదీన జరిగే మేనేజింగ్ కమిటీ సమావేశానికి రావాలని ఆదేశం అందింది. కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామానికి చెందిన తోట కృపామణి ఇప్పటికే కొయ్యల గూడెం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్నారు. మహిళలను ఆర్థిక స్వాలంబన దిశగా నడిపించటానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం స్త్రీ నిధిని ఏర్పాటు చేసింది. దీని ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఋణ సదుపాయం కల్పించి తమ కాళ్ళపై తాము నిలబడేలా మహిళలను ప్రోత్సహిస్తున్నది. భర్త సంపాదనకు భార్య కూడా చేయి అందించటానికి స్త్రీ నిధి ద్వారా కుటీర పరిశ్రమలు మహిళలచేత ప్రారంభిస్తున్నారు. ఈ మహిళల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం మహిళా మార్టులు నెలకొలపుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్త్రీ నిధి (మహిళా బ్యాంక్) నడిపించటానికి మహిళలతోనే పాలకవర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పాలక వర్గంలో ప్రతీ జిల్లా నుంచి ఒక మహిళను డైరెక్టర్ ఎంపిక చేశారు. ఏలూరు జిల్లా నుంచి రాష్ట్ర డైరెక్టర్ గా తోట కృపామణిని ఎంపిక చేశారు. ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ , డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్ రాజు, డిఆర్పిలు విజయ కుమారి, అనిత, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ శశి కుమార్ లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

బిక్షాటన చేసిన అంగన్‌వాడీ సిబ్బంది

విశాలాంధ్ర - లింగపాలెం : అంగన్‌వాడీ సిబ్బంది తమ సమస్యల సాధనకు చేస్తునన సమ్మె తొమ్మిదవ రోజుకు చేరింది. లింగపాలెం మండలంలో సమ్మె చేస్తున్న సిబ్బంది బుధవారం బిక్షాటన చేశారు. తమకు తగిన వేతనాలు ఇవ్వకపోవటం వల్ల బిక్షాటన చేసుకోవాల్సి వస్తుందని వీరంతా ఆవేదన చెందారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. పనిభారంతో సతమతమవుతూ తగిన వేతనాలు ఇవ్వకపోటం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వీరు ఆరోపించారు.

CHANGE OF NAME
I, PATCHAMATLA DEVI, W/o. VENKATA SURYANARAYANA RAJU, Resident of D. No.7-2-32/2, Narasayya Agraharam, Bhimavaram, west godavari, A. P-534201. I have changed my name from **PATSAMATLA DEVI (Old Name) To PATCHAMATLA DEVI (New Name)** Hence after all my documents and correspondence will be continue with my new name **PATCHAMATLA DEVI.**

అదుపు తప్పిన ఆర్టీసి బస్సు
ప్రమాదంలో ఇరువురి మృతి

విశాలాంధ్ర - కైకలూరు : మండవల్లి మండలంలోని కాకతీయనగర్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు లారీని క్రాస్ చేస్తూ అదుపు తప్పి టీవీఎస్ బండిని గుద్ది సైడ్ బోదిలోకి దూసుకువెళ్లి బోల్తా కొట్టడంతో ప్రమాదంలో మహిళతో పాటు,మోటారు సైకిల్ మీద వ్యక్తి మృతి చెందారు.సంఘటన విషయం తెలుసుకున్న శాసనమండలిసభ్యులు జయమంగళ వెంకటరమణ, శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ క్షత గాత్రులను తన కారులో ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఇద్దరినీ గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం ఘటన స్థలం నుంచి నేరుగా హాస్పిటల్ కి వెళ్లి క్షత గాత్రులను పరామర్శించి బాధితులకు దుస్తులు అందజేశారు. . అదుపుతప్పికాలువలోకి దూసుకు పోయిన ఏలూరు డిపో కి చెందిన పల్లె వెలుగు బస్సులో సుమారు 61మందికి పైగా ప్రయాణికులు వున్నారు.
ఐదుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రులకు తరలింపు చేశారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో మాట్లాడి వారి గమ్య స్థానాలకు, దగ్గరలో ఉన్న స్టేషన్‌కు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మహిళ మృతి : గుర్తు తెలియని మహిళ ఏలూరు నుండి నరసాపురం వెళ్లే బస్సులో ఏలూరు నుండి కైకలూరు వరకు టికెట్ తీసుకుంది. నీలం రంగు చీర , చేతికి లక్ష్మి దేవి ఉంగరం ఉంది. సుమారుగా 45 నుండి 50 ఏళ్ల వయసు ఉంటుంది, మృత దేహం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంది. మండవల్లి ఎస్ఐ సెల్ నెం. 9440796436ను సంప్రదించవచ్చు.

మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌ల సమ్మెకు మద్దతు

విశాలాంధ్ర-తణుకు: ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన దేశ వ్యాపిత సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు, సంఘీభావం ప్రకటించింది.సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు బుధవారం తణుకు కోర్టు సమీపంలో మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్‌లపై పనిభారం తగ్గించాలని, వేధింపులు విడనాడాలని, నిర్దీత పని విధానం, పనిగంటలు అమలు చేయాలని, శ్రమకు తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఔషధాల(మందులు) ధరలు నియంత్రించాలని,నకిలీ, నాసిరకం మందులు అరికట్టాలని కోరారు.

వంటావార్పుతో అంగన్వాడీల నిరసన

విశాలాంధ్ర -నూజివీడు టౌన్ : తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న నిరసన దీక్షలు బుధవారంతో 9వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు వంట వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చాట్ల పుల్లారావు, అంగన్వాడి నాయకులు క్రిస్టియానమ్మ, దుర్గ, ఆదిలక్ష్మి, పద్మ, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలన అవగాహన కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఏలూరు: జాతీయ కుష్టువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27వ తేదీ నుంచి జనవరి 12వ తేదీ వరకు ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో కుష్టువ్యాధి కేసులను గుర్తించే కార్యక్రమంపై సంబంధిత జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి నివారణ, వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగించే కరపత్రాలను డిఆర్ఓ ఎం. వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి కేసులను గుర్తించేందుకు ఈనెల 27వ తేదీ నుంచి జనవరి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల, గ్రామస్థాయి అధికారులు సహకరించాలన్నారు. ఇంటింటి సర్వేకు సంబంధించి పారా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలో ఏప్రిల్ 2022 నుండి ఇప్పటి వరకు 63 కొత్త కేసులు రిజిష్టర్ అయి వైద్యం పొందుతున్నారన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. శర్మిష్ట, డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ ఎం. నాగేశ్వరరావు, ఏలూరు ఆర్డిఓ ఎస్.ఎస్.కె. ఖాజావలి, జెడ్పి డిప్యూటీ సిఇఓ ఎస్. నిర్మలాజ్యోతి, పలువురు కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీల భిక్షాటన

విశాలాంధ్ర - వేలేరుపాడు : తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలు బుధవారం భిక్షాటన చేశారు. తొమ్మిది రోజులుగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరించటం సరైన చర్య కాదన్నారు. అనేక ఏళ్లుగా తక్కువ వేతనాలతో ఉద్యోగాలు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వానికి కనికరం లేదన్నారు. వేతనాలు పెంచాలని ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, మండల కార్యదర్శి బానిస రాము, సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు కౌలూరి సైదా, చందా రమాదేవి, సువ్వేటి లత, దాసరి సుశీల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు రద్దు చేయాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి

విశాలాంధ్ర -భీమవరం: కరువు మండలాల్లో విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని, జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, కళాశాల హాస్టల్స్‌కు సొంత భవనాలు మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు భీమవరంలో బుధవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సంబంధిత సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ స్థాయిలో వర్షపాతం నమోదు కావడంచే రాష్ట్ర వ్యాప్తంగా అనేక మండలాల్లో కరువు ఆవరించిన సందర్భంగా కరువు మండలాలో ఉన్న విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా కళాశాల విద్యార్థుల మెస్ చార్జీలు నెలకు 3 వేలు , పాఠశాల విద్యార్థులకు 2500 రూపాయలు చెల్లించాలని, జిల్లాలో పలు కళాశాలల హాస్టల్స్ రెంటెడ్ బిల్డింగ్స్‌లో నడుస్తున్నాయని వాటికి సొంత భవనాలు మంజూరు చేయాలని, హాస్టల్స్ లో ఖాళీగా ఉన్న కుక్కు, కమాటీ, వాచ్మెన్ పోస్టులు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యు.మురళి, వి.సాయి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : మహిళలను ఎవరైనా వేధిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్ హెచ్చరించారు. విద్యా సంస్థలోని మహిళా గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వాక్ దాన్ (నడక) కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి వీరేష్ కుమార్ మాట్లాడుతూ మహిళలు పనిచేసేచోట ఎటువంటి వివక్షకు గురికాకుండా వారికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేసిందన్నారు. మహిళలు గౌరవప్రదంగా పనిచేసుకోవా లన్నదే ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్య మని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే గ్రీవెన్స్ సెల్ దృష్టికిగాని, ఉన్నతాధికారుల దృష్టికి గాని తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, బోధన, భోదనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డల్హౌసీ ట్రెక్కింగ్ క్యాంపు పూర్తి చేసిన యూత్ హాస్టల్స్ సభ్యులు

విశాలాంధ్ర -భీమవరం: సముద్ర మట్టానికి 8,000 అడుగుల ఎత్తులో హిమాలయాలకు పశ్చిమ ప్రాంతములో ఉన్న డల్హౌసీ స్నో ట్రెక్కింగ్ - కం - ట్రైనింగ్ ఎక్సపెడిషన్ -2023 సాహసోపేతమైన యాత్రలో పాల్గొనే అరుదైన అవకాశం భీమవరం యూనిట్‌కు లభించడం చాలా ఆనందంగా ఉందని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం యూనిట్ చైర్మన్ ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్నో ట్రెక్కింగ్‌లో పాల్గొన్న బృందం తమ యాత్రను పూర్తి చేసుకుని బుధవారం భీమవరం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ డల్హౌసీ హిమాలయ పర్వతప్రాంతాల్లో ప్రకృతి అత్యంత సుందరమైన, రమణీయమైన ప్రదేశాలలో ఒకటిగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రదేశమని, డల్హౌసీ "హిల్ స్టేషన్" సముద్ర మట్టానికి 1970 మీ. ఎత్తులో ఉంటుందని అందమైన దేవదారు వృక్షాలు, పచ్చిక మైదానాలు, మంచుతో కప్పబడిన పర్వత శిఖరాలు, పురాతన మఠాలు, మెరిసే సరస్సులు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయనుటలో సందేహం లేదని ఆయన వివరించారు. కార్యక్రమంలో భాగంగా ట్రెక్కింగ్ లో పాల్గొన్న జానపాటి మధుసూదనరావు, కటికిరెడ్డి వెంకటరత్నం, భాస్కరపెద్దిరాజు, వోలేటి లక్ష్మణరావు, స్వామి, ఇంటి ఉదయ భాస్కర్,పల్లాలరాజు, దుర్గా ప్రసాద్, మంతెన పల్లంరాజు, పొదిల స్వామి, శ్యామసుందరరాజు,లక్ష్మీపతి రాజు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో నందమూరి ఆంజనేయులు, పుల్లా దుర్గా ప్రసాద్, బొండా శ్రీరామ్, తాళ్లపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టి కోటాలో ఔట్సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఉద్యోగాల నియామకం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా రెవెన్యూ శాఖలో ఎన్నికల నిమిత్తం డేటా ఎంట్రీ ఆపరేటర్లను పొరుగు సేవల పద్ధతిలో భర్తీకి అర్హులైన ఎస్.టి అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ శాఖలో ఎన్నికల విధులు నిమిత్తం మూడు డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులు భర్తీకి పొరుగు సేవ విధానంలో నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన వారై ఉండడంతో పాటు, షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్.టి) వారు మాత్రమే అర్హులన్నారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కంప్యూటర్ సైన్స్/బిటెక్, బీసీఏ, ఎంసీఎలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 42 సంవత్సరాలు లోపు వయసు ఉండాలని తెలిపారు. దరఖాస్తు సమర్పణకు ఈనెల 24ను చివరి తేదీగా ప్రకటించారు. నెలకు వేతనం రూ.18వేల 500 లుగా నిర్ణయించినట్టు తెలిపారు.

విద్యార్థులు సైన్సు పట్ల ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యార్థులు బాల్యం నుంచే సైన్సు పట్ల ఆసక్తి పెంచుకోవాలని విద్యా శాఖాధికారిణి ఎస్.కళ్యాణి తెలిపారు. టి నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో దోహద పడుతుంది అన్నారు. జీవితంలో ప్రతి విషయం సైన్సుతో ముడి పడి వుంటుందని ఆమె తెలిపారు. విజ్ఞాన ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల, వీరభద్రవరం యుపి స్కూల్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్ర మంలో ఆర్‌విజి కృష్ణారావు, కె. కుటుంబరావు, చైతన్య కుమార్, ఎల్.శరత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

విశాలాంధ్ర - లింగపాలెం : రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలుపుతూ ధర్మాజీ గూడెంలో పోలీసులు, ప్రతిభ కాలేజి, హోలిట్రినిటి స్కూలు విద్యార్థులు సంయుక్తంగా బుధవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ నాగ మల్లేశ్వరరావు, ఎస్ఐ చెన్నారావు రోడ్డు భద్రతపై సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారంతా హెల్మెట్‌లు కలిగి ఉండటం వల్ల రక్షణ ఉంటుందని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రతిభ కాలేజి కరస్పాండెంట్ సుజాతకుమారి పాల్గొన్నారు.

యువగళం నవశకం కార్యక్రమానికి భారీగా తరలిన కార్లు

విశాలాంధ్ర-తణుకు: యువగళం నవశకం సభ కార్యక్రమానికి బుధ వారం మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఇంటి నుండి భూమాత టౌన్ షిప్, పోలిపల్లి గ్రామంకి భారీగా కార్లలో బయలుదేరారు. లోకేష్ యువగళం నవశకం సభ కార్యక్రమానికి తణుకు నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా తణుకు పట్టణ అధ్యక్షులు వెంకటకృష్ణ మాట్లాడుతూ వైకాపా అక్రమాలను, అన్యాయాలను ఎదిరిస్తూ వారు చేస్తున్న కుట్ర రాజకీయాలను అడ్డు కుంటూ ప్రజలకు ఒక భరోసా కల్పించే విధంగా యువతకు ఒక భరోసా ఇచ్చే విధంగా యువగళం పాదయాత్ర ద్వారా లోకేష్ ఒక ప్రభంజనంలా వెళ్లారని అన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు మండల అధ్యక్షులు పితాని మోహన్, ఇరగవరం మండల అధ్యక్షులు గోపిశెట్టి రామకృష్ణ, తణుకు పట్నం కార్యదర్శి ఒమ్మి రాంబాబు, ఇరగవరం మండలం కార్యదర్శి బొంతు శ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చుక్క సాయి బాబా, తణుకు పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు చదలవాడ నాని తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి లక్ష్యం

విశాలాంధ్ర-కాళ్ళ: గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యమని గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వర రావు అన్నారు. బుధవారం విశాలాంధ్ర విలేఖరితో మాట్లాడుతూ గ్రామంలో అనేక అభివృద్ధి పనులను ప్రభుత్వ, పంచాయతీ నిధులతో చేశామని, ప్రస్తుతం ఎన్.ఆర్.జి.ఎస్ నిధులు రూ. 10 లక్షలతో రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, నాలుగు కల్వర్టులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గతంలో డంపింగ్ యార్డ్ పైప్ లైన్‌కు రూ.10లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. సచివాలయం వద్ద వాటర్ ట్యాంక్‌ను మరమ్మతులు చేపట్టామన్నారు. నాగమ్మ గుడి వద్ద 300మీటర్ల పొడవునా సిసి రోడ్డు నిర్మించామన్నారు. విద్యుత్తు లోపాలను సవరించామన్నారు. ఇప్పటివరకు 5 సిసి రోడ్లను, గ్రామమంతా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించామన్నారు. త్వరలోనే డిసిసిబి చైర్మన్, పి.వి. ఎల్ నరసింహారాజు సహకారంతో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో మిగిలిన రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు.

జర్నలిస్ట్ శ్రీనివాస్‌కు రూ.1 లక్షా 50 వేల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గవరవరం గ్రామానికి చెందిన తప్పెట్ల శ్రీనివాస్ ప్రజాశక్తి దినపత్రికలో కొయ్యలగూడెం మండల విలేకరిగా పనిచేస్తూ ఉండగా గత సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో శ్రీనివాస్‌కు రాజమండ్రిలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం అందించారు. అప్పటినుండి శ్రీనివాస్ ఇంటి వద్దనే ఉంటూ ఫిజియోథెరపీ వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్ కు మెరుగైన వైద్యం అందించాలని తలకు బలమైన గాయం కావడంతో ఆపరేషన్ చేయాలని తెలపడంతో నిస్సహాయ స్థితిలో ఉన్న శ్రీనివాస్ పరిస్థితిని తెలుసుకుని బయ్యనగూడెం గ్రామానికి చెందిన నాటకశాల వెంకటరాజు రూ.1 లక్ష50వేలు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంకటరాజు శ్రీనివాస్ కు ఆరోగ్యం మెరుగుపడుతుందని, మరల అందరిలో కలిసిమెలిసి ఉంటావని ధైర్యం చెప్పారు. శ్రీనివాస్‌కు ఆర్థిక సహాయం చేసిన వెంకటరాజు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి తన వంతు సహాయ సహకారాలు అందచేస్తున్నారని పలువురు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం మండలం విలేకరులు ఎం. సాయిబాబా, పూలపల్లి కృష్ణబాబు,బొబ్బర కిషోర్,చిటికెన రమేష్, మన్నె దుర్గ బాబు, షేక్ అలీమ్, హరికృష్ణ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో క్రీడలు ప్రారంభం

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : బరింకలపాడు గురుకుల పాఠశాలలో జరుగుతున్న అండర్ 17 ఈస్ట్ అండ్ వెస్ట్ జోన్ 2 క్రీడోత్సవాలను పోలవరం శాసన సభ్యులు తెల్లం బాలరాజు ప్రారంభించారు. క్రీడాకారులు, పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేకు గౌరవ వందనంతో ఘన స్వాగతం పలికారు. క్రీడా ఉత్సవాల జెండాను ఆవిష్కరించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో జరుగుతున్న అండర్ 17 క్రీడా పోటీలకు విచ్చేసిన క్రీడాకారులందరూ తమ ప్రతిభను కనబరిచి క్రీడలలో ముందుకు సాగాలని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, స్నేహభావంతో క్రీడలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోర్స పోచమ్మ, జడ్పిటిసి మల్లం.వసంతరావు, వైస్ ఎంపీపీ సోమగానీ. శ్రీనివాసరావు, ఎంపీటీసీ సున్నం సురేష్, సొసైటీ అధ్యక్షులు బోద. శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు,ఎస్ఐవి చంద్రశేఖర్. క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలి

విశాలాంధ్ర-భీమవరం: అంగన్వాడి, ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను జగన్ సర్కారు ఆమోదించి అమలు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక కృష్ణమూర్తి, ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ దండు శ్రీనివాసరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం భీమవరంలో వారు మీడియాకొక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26000 వేలు అమలు చేయడానికి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు జీతం అదనంగా ఇస్తామని జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. న్యాయమయిన డిమాండ్ల కోసం అంగన్వాడీ, ఆశ వర్కర్లు చేపట్టే అన్ని ఉద్యమాలకు తమ పార్టీ అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

మాస్కులు తప్పనిసరిగా ధరించాలి

విశాలాంధ్ర - లింగపాలెం : కోవిడ్ వేరియంట్ వేగంగా విస్తరిస్తుండటంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారంతా మాస్కులు ధరించాలని తహశీల్దార్ ఆర్.వి.మురళీ కృష్ణ తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో నిర్ణయాలు తీసుకున్నట్టు ఈయన వెల్లడించారు. కార్యాలయాలలో పనిచేసే సిబ్బంది మాస్కులు ధరించాలని పేర్కొన్నారు. మాస్కులు లేనివారిని కార్యాలయాల లోపలికి అనుమతించమని తహశీల్దార్ హెచ్చరించారు.

యువగళం ముగింపు సభకు వెళ్లిన నాయకులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా పోలవరం నియోజకవర్గం లో ఉన్న వివిధ మండలల తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం కొయ్యల గూడెం పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుండి బయలుదేరి వెళ్లారు. సభకు వెళుతున్న నాయకుల కార్లకు మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్యశ్రీ ఎంతో ఉపయోగకరం

విశాలాంధ్ర - కైకలూరు : మండలం లోని ఆటపాక గ్రామంలో ఆరోగ్యశ్రీ పరిధి 5 లక్షల నుంచి 25 లక్షల వరకు పెంచిన కార్డు ప్రతి పేద వాడికి డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ హెల్త్ కార్డు ఎంతో ఉపయోగ పడుతుందని శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు, శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ అన్నారు. కార్డులను లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డులు అందించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, జిల్లా సంయుక్త కార్యదర్శి, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, మండల పార్టీ అధ్యక్షులు భట్రాజు శివాజీ, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలు జిల్లాలో విజయవంతంగా నిర్వహించడానికి సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మట్టిలోని మాణిక్యాలను వెలికితీయడానికే సచివాలయాల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమా లను చేపట్టనున్నామని ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. క్రీడలపై ఆసక్తి ఉన్న క్రీడాకారులను మరింత ప్రోత్సహించడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ మని రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో క్రీడలు నిర్వహించాలన్నారు. విజేతలకు బహుమతులు ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింటు కలెక్టరు ఎస్. రామ్ సుందర్ రెడ్డి, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. మహేశ్వర రావు, డిఎల్డివో ఏవీ అప్పారావు, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎం. దుర్గా రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఇవ్వండి

పీపుల్ స్టార్ ఆర్. నారాయణమూర్తి

విశాలాంధ్ర-వీరవాసరం: ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట తప్పారని సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి విమర్శించారు. తోలేరులో జాతీయస్థాయి నాటిక పోటీల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పార్లమెంటు భవనంలో చోటు చేసుకున్న దాడి ఘటనపై విపక్ష నేతలు అడిగే ప్రశ్నలకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ మౌనం వహించడం ప్రజాస్వామ్య విరుద్ధమని, దుండగులకు పాసులు జారీ చేసిన భాజపా ఎంపీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. 32 మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే యోచనను విరమించుకోవాలన్నారు. రాముడు గురించి చెప్పడం రామాలయాలు కట్టడమే కాదు రాముడికున్న ఆదర్శాలలో ఒకటయిన ఒకటే మాటను... చెప్పిన దానిని ఆచరించడంను పాలకులు ఆదర్శంగా తీసుకుని ఆచరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వాలు ఇనుప ఖనిజం గనులను విశాఖ స్టీల్ కు కేటాయించక పోవడంతోనే స్టీల్ ప్లాంట్ కు మధ్య, మధ్యలో నష్టాలు వస్తున్నాయన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి, ప్రజా వ్యతిరేక చట్టాలను వ్యతిరేకంగా భగత్ సింగ్, బటుకేశ్వర్ దత్ లు ఆనాటి నేషనల్ అసెంబ్లీలో పొగ బాంబును విసిరేరని ఆయన ఆనాటి దేశభక్తులను, సంఘటన లను గుర్తు చేసుకున్నారు. ప్రజలే తన సినిమాలకు నిర్మాతలని చోదక శక్తులని ఆయన చెబుతూ,దేశ వ్యాప్తంగా ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతాలతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు.

ఇంధన పొదుపు.. భవిష్యత్‌కు మలుపు

- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: ఇందన వనరులను అవసరం మేరకు పొదుపుగా సమర్థంగా వాడుకోవడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు.జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం విద్యుత్ పొదుపుపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లా డుతూ నానాటికి అధికమవుతున్న ఇందన వినియోగం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుందని దానితో ప్రజారోగ్యా నికి ఎంతో హాని వాటిల్లుతుందన్నారు. ఈ దృష్ట్యా అవసరాల మేరకే పొదుపుగా ఇందన వినియోగం తప్పని సరి అన్నారు. గృహాలు, వాణిజ్య సముదాయాల్లో బిఇఇ స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ ఉపకరణాలను వినియోగించుకోవడం మంచిదన్నారు. ఎపిఇపిడిఎసిఎల్ ఎస్ఇ పి. సాల్మన్ రాజు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తముగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించబడ్డాయన్నారు. ఈ పోటీలోని ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు జిల్లా కలెక్టరు వె. ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయడం జరిగిందన్నారు.

గ్రామీణ క్రీడలలో యువత సత్తా చాటాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గ్రామీణ ప్రాంతాలలో యువత క్రీడలలో పాల్గొని తమ సత్తా చూపించి ఉన్నత శిఖరా లను అధిరోహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఈనెల 26వ తేదీన మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో ప్రారంభం కావడం జరుగుతుందని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం కొయ్యలగూడెం గ్రామంలో ఉన్న బాలుర హైస్కూల్ క్రీడా మైదానాన్ని అధికారులతో, సచివాలయ సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులంతా సిద్ధంగా ఉండాలని ఆమె తెలిపారు. ఈమె వెంట ఈవోపిఆర్డి సతీష్, సచివాలయ సెక్రటరీలు సూర్య, వెంకటరమణ, ఎం.ఏ. ఈ.ఓ. పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజ నేయ చౌదరి చేస్తున్న అనేక సేవా కార్యక్రమంలో భాగంగా కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామంలో మహిళలకు ఉచిత కుట్టి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి నేటికీ 90 రోజు అయిందని, మహిళలు ఈ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో తర్ఫీదు పొంది వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడి ఆర్థిక పురోగతి సాధించాలని తపన చౌదరి కోరుకుంటున్నారని కొయ్యలగూడెం మండల సేవా ప్రతినిధులు ఆరేటి.యేసుబాబు ,మునిరెడ్డి కావ్య నాగ శ్రీ, పేర్కొన్నారు. మహిళలు 90 రోజుల పాటు కుట్టు శిక్షణ నేర్చుకోవడానికి స్థలాన్ని ఇచ్చిన తలదాత మల్లబత్తుల గంగరాజు ను తపన ఫౌండేషన్ తరుపున, కొయ్యలగూడెం బిజెపి ఉపాధ్యక్షులు కోన రామకృష్ణ, బచ్చు బాబు రావు, నెక్కంటి సూర్య కుమార్ లు ఆయనను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కుర్రు వెంకట నాగేశ్వరరావు, మల్లబత్తుల రాము, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలో సన్ షైన్ విద్యా సంస్థలకు చెందిన బస్సు, బుధవారం, ఐదో వార్డ్ రంగమన్నారు పేటలో, రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఢీ కొట్టడంతో ప్రమాదం సంభవించింది. బస్సు బలంగా ఢీకొట్టడంతో సిమెంట్ దిమ్మ పై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ పై నుండి కిందకు జారిపడింది. విద్యుత్ స్తంభం నేలకు ఒరిగి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బస్సులో విద్యార్థులు ఎవరూ లేకపోవడం, ప్రాణనష్టం సంభవించక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రతి ఇంటా శ్రీవారి క్యాలెండర్లు శుభప్రదం

విశాలాంధ్ర - అమలాపురం : ప్రతి ఇంటా తిరుమల శ్రీవారి క్యాలండెర్లు ఉండటం శుభప్రదమని టీటీడీ ఎస్వీబీసీ అడ్వైజర్ అడపా దుర్గ అన్నారు. టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీబీసీ ఛానల్‌ను దేశవ్యాప్తంగా ఆదరిస్తున్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీలో మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సహకారం మరవలేనిదని ఆయన అన్నారు. కాట్రేనికోనలో పలు ఆలయాల్లోని వేదపండితులు, పూజారులు, ఆధ్యాత్మికవేత్తలకు తిరుమల తిరుపతి దేవస్థానం 2024 క్యాలెండర్లను, డైరీలను దుర్గ అందజేసారు. ఈ సందర్భంగా గ్రామదేవత మావుళ్లమ్మతల్లి దేవస్థానం చైర్మన్, తన గురువులు ఆణివిళ్ల సాయిబాబాను దుర్గ సత్కరించారు. ఇంటింటి తిరుమల శ్రీవారి క్యాలెండర్లు అందించాలనే కార్యక్రమంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వీటిని అందజేస్తున్నట్లు దుర్గ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవసంఘ సమాఖ్య అధ్యక్షులు ఆకొండి ఉమామహేష్, కంచుస్తంభం సోనీ, కాళ్లకూరి కామేశ్వరరావు, కముజు లక్ష్మణ్, తాతపూడి కృష్ణ, ఫణికాంత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలు ఎదురైనా సమ్మెను కొనసాగించండి

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెను నిర్బంధాలతో అణిచివేయాలని సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నం చేస్తున్నదని సమస్యలు పరిష్కారం దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. తొమ్మిదో రోజు సమ్మెకు అమలాపురం సిడిపిఓ ఆఫీస్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆయన మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్బంధాలతో సమ్మెను అణిచివేయాలని ప్రయత్నం చేస్తుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీ దీక్షా శిబిరాన్ని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ జ్యోతీబస్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. సమ్మె శిబిరంలో పి అమూల్య, విజయ, రత్నకుమారి, మణిమాల, దైవకృప, బేబీ గంగారత్నం, ఐసిడిఎస్ ప్రాజెక్టుకు పరిధిలోని అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా జనసేన మహా పాదయాత్ర

విశాలాంధ్ర - సీతానగరం: గెలుపే లక్ష్యంగా జనసేన మహా పాదయాత్ర అని రాజానగరం నియోజకవర్గ జనసేన నాయకులు తోట నవీన్ అన్నారు. మండలంలోని వంగలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం జనసేన నాయకులు తోట నవీన్ అధ్యక్షతన మహా పాదయాత్ర నిర్వహించారు. దీనిలో భాగంగా జనసేన నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ జనసేన ప్రభుత్వం వస్తే చేపట్టబోవు కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తోట నవీన్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో రాజనగరం నియోజకవర్గంలో జనసేన పార్టీ గెలుపే లక్ష్యంగా ఒకేసారి నియోజకవర్గ పరిధిలో మూడు మండలాల్లో ఒకేసారి మహా పాదయాత్ర నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ శంకర్, ఉపా అధ్యక్షుడు సత్యనారాయణ, మట్టా వెంకటేశ్వరరావు, దూలం కృష్ణ , ఏసు పాదం, పోసి రత్నం, దాసరి రమేష్ మొదలగు జనసేన నాయకులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి

విశాలాంధ్ర - రాజానగరం : రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపు మేరకు మండల కేంద్రమైన రాజానగరంలోని సచివాలయం-3 వద్ద బుధవారం జరిగిన సదస్సులో ఎంపీపీ మండారపు సీతారత్నం వీర్రాజు,పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, వైస్ ఎంపీపీ కొల్లి వీర్రాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అర్హులకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీగా పోలిపల్లికి టిడిపి అభిమానులు

విశాలాంధ్ర - ఉంగ్రాజవరం: విజయనగరం జిల్లా పోలిపల్లి లో బుధవారం జరగనున్న తెలుగుదేశం పార్టీ యువ గళం నవశకం బహిరంగసభకు మండలంలోని వేలివెన్ను నుండి టిడిపి, జనసేన పార్టీల అభిమానులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుండి టిడిపి అభిమానులు ఉదయం 6 గంటలకే నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఇంటి వద్దకు, వేలివెన్ను చేరుకున్నారు. అల్పాహారం అయిన అనంతరం శేషారావు నివాసం వద్ద నుండి, జనసేన జిల్లా నాయకులు పాల వీరాస్వామి తో కలిసి శేషారావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. 180 వాహనాలలో సుమారు 1200 మంది భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లా డుతూ జనసేన, టిడిపిలు ఎన్నికలలో వైఎస్ఆర్సిపిని, జగన్మోహన్ రెడ్డిని ఓడించడం ఖాయమన్నారు.

యువగళం ముగింపు సభ కాదు... విజయానికి నాంది

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగు దేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం ముగింపు సభ కాదని టీడీపీ విజయానికి నాంది అని నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. విజయనగరం జిల్లా పోలిపల్లిలో నారా లోకేష్ తలపెట్టిన బహిరంగ సభకు నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు బుదవారం భారీగా తరలివెళ్లారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని బూరుగుపూడి గ్రామంలోని పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.ఆయన వెంట పార్టీ జిల్లా ఉపధ్యక్షులు గంగ్గిశెట్టి చంటిబాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు,పార్టీ రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యులు వంక మల్లిఖార్జున స్వామి,నాయకులు కొల్లం రత్నం, నూనె వెంకన్న, దేవన నరసయ్య,సోడాసాని త్రిమూర్తులు,దొండపాటి లాజర్,అడపా వీరబాబు, కార్యకర్తలు అభిమానులు భారీగా తరలి వెళ్ళారు.

ఏడు వారాల వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల, ఏడువారాల వెంకన్నగా కొలిచే ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. 29 రోజులకు ఆలయ ప్రధాన హుండీల నుంచి రూ.60,55,845, అన్న ప్రసాద హుండీల నుంచి రూ.24,60,434 వెరసి మొత్తం రూ.85,16,279 వచ్చిందని దేవస్థానం ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. హుండీల్లో పలు దేశాల విదేశీ కరెన్సీ కూడా వచ్చిందని తెలిపారు. అలాగే 10 గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి, శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీ 29 రోజులకు రూ.2,52,976లు వచ్చినట్టుమరియు పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చినది తెలిపారు. హుండీ లెక్కింపుకు పర్యవేక్షణాధికారులుగా కేయన్‌విడివి డా బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా దేవాదాయ శాఖ అధికారి, యమ్ రాధాకృష్ణ కార్యనిర్వహణాధికారి గ్రేడ్ వన్‌ఈ ఉప్పలపాటి జానకీయమ్మ అన్నదాన సత్రం, పొడగట్లపల్లి, యన్‌వివి సత్యనారాయణ, గ్రేడు 3 కార్యనిర్వహణాధికారి, వెల్ల గ్రూప్ దేవాలయములు, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, మీసాల రాధాకృష్ణ, ధర్మకర్తలు ఏపుగంటి కనకారావు, శనగల సత్యనారాయణ, మెర్ల వెంకటేశ్వర రావు, మన్యం భాను, అర్చకస్వాములు, గ్రామస్థులు, పత్రికా ప్రతినిధులు, పోలీసులు, కెనరా బ్యాంక్, రావులపాలెం, బ్యాంక్ ఆఫ్ ఇండియా, రావులపాలెం తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లిలో మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక గండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ చలగళ్ళ దొరబాబు ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ 5 లక్షల నుండి 25 లక్షలకు పెంపు చేయడం జరిగిందని, ప్రజల యొక్క ఆరోగ్యమే ప్రధానమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఏ గ్రామంలోనైనా సమస్యలు ఇంకా మిగిలి ఉంటే ఉన్నతాధికారులకు తెలియ చేస్తే ఆ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని తెలియజేశారు. మురారి గ్రామంలో 110 ఎకరాల పొగాకు పంట వేయడం జరిగిందని, పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని 40 శాతం పంట నష్టం కలిగిందని, నష్టపోయిన పొగాకు రైతాంగానికి నష్ట పరిహారం అందజేయాలని గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ కోరారు. తాళ్లూరులో రీ సర్వే పెండింగ్లో ఉందని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిన్ని వీరబాబు తెలియజేశారు. జేజేయం పనుల్లో భాగంగా ట్యాంకు ప్రారంభించి, ఫోటో తీసుకుని అధికారులు వెళ్లిపోయారని తాళ్లూరు ఎంపిటిసి రాంబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముందు ఎంపీడీవో వెంకటరామన్ అంచనా బడ్జెట్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జడ్పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, కందుల చిట్టిబాబు, అడబాల ఆంజనేయులు, తహసిల్దార్ కెవివి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఏపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - పిఠాపురం : ఆంధ్రప్రదేశ్ భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ది బార్ అసోసియేషన్ పిఠాపురం ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా 12వ అదనపు జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ దగ్గర నుండి మొదలుకొని పట్టణంలో ప్రధాన కూడళ్ళ మీదుగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉప్పాడ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని, న్యాయవాదుల సమ్మె పరిష్కారం చేయాలని, ప్రజల ఆస్తులకు భద్రత లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని, స్థానిక సివిల్ కోర్టులకు జూరెడిక్షన్ ఉండాలని, కోర్టులు చేయాల్సిన పని రెవెన్యూ అధికారులకు కట్టబెట్టడం తగదని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం రాజారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీ న్యూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చింది అన్నారు. ఈ చట్టం వల్ల ప్రజల ఆస్తులకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యక్షుడు ఎస్ఎం అలీ మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం టైటిలింగ్ అధికారి, అప్పిలేట్ అధికారి వద్ద భూవివాదాలు, ఆస్తి తగాదాలు పై వారిచ్చే ఆర్డర్లపై ఆపిల్‌కు వెళ్లాలంటే హైకోర్టులకు మాత్రమే విచారణ పరిధి కల్పించారని స్థానిక సివిల్ కోర్టులకు జూరెడిక్షన్ లేదన్నారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు వ్యయ, ప్రయాసలు పడి హైకోర్టులకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుది మెల్ల భాస్కరాచార్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన, చట్టపరమైన హక్కులను కాలరాస్తూ ఏపీ న్యూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో చీకటి చట్టాన్ని తెచ్చిందని పేర్కొన్నారు. ఈ చట్టం గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు జిల్లావ్యాప్తంగా న్యాయవాదులు ఆందోళన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం పట్టుదలకు పోకుండా ఏపీ బార్ కౌన్సిల్, న్యాయవాద సంఘాలు, బార్ అసోసియేషన్‌లతో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలు, రైతు సంఘాలు అందర్నీ కలుపుకొని ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బంగారు రామకృష్ణ, పివిఎస్ఆర్ మూర్తి, కొంజర్ల అప్పారావు, వివి నగేష్, ఎం సత్యవతి, మహేష్, ముమ్మిడి శ్రీనివాస్, రామకృష్ణ, గౌతు రాజా, ఎంవిఎస్. శాస్త్రి, యేసు రత్నం, కీర్తి హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వాహనాలపై ప్రధాని మోడీ స్టిక్కర్లు

విశాలాంధ్ర-కొవ్వూరు : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ వెహికల్స్ మీద, ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాన్ని యువ మోర్చా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు పట్టణ బీజేపీ నాయకుల సహకారంతో అంటించడం జరిగింది. ఈ సందర్భంగా యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గోపిశెట్టి శివకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మాడిచర్ల రామచంద్రరావు మాట్లాడుతూ కేంద్ర పథకాల మీద స్టిక్కర్ అంటించుకునే ఈ ప్రభుత్వం మార్పు చెందుతేనే ప్రజల్లో అభివృద్ధి అనేది జరుగుతుందన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు గెల్లా కేశవ మాట్లాడుతూ సొమ్ము కేంద్రానిది సోకు వైయస్సార్ పార్టీది. ఈ తీరు మార్చకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు జడ్ఎ బేగ్, భారత్వజ్ శర్మ, మణికంఠ, మాణికుమార్, సుంకర శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు